క్లుప్తంగా

కలెక్టర్, ఎస్పీకి క్లాత్ బ్యాగులు అందజేత

నల్లగొండ టౌన్: సమాజ సేవకుడు పెండెం కృష్ణకుమార్ బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సి.నారాయణరెడ్డిని కలిసి క్లాత్ బ్యాగ్ అందజేశారు. అనంతరం ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ను కలిసి ఆయనకు కూడా క్లాత్ బ్యాగ్ అందజేశారు.

పీజీ ఎంట్రెన్స్‌లో ఎన్జీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఉపేందర్, అధ్యాపకులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని ఎన్జీ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో కేంద్రీయ విశ్వవిద్యాలయాల పీజీ ఎంట్రెన్స్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి సీటు సాధించారు. కళాశాలకు చెందిన సాయి దీపక్.. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ రాజస్థాన్ ఎమ్మెస్సీ క్రిమినాలజీ, నందిని అనే విద్యార్థిని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడులో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ టెక్స్‌టైల్, గణేష్ అనే విద్యార్థి సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెస్సీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, కె.కీర్తి అనే విద్యార్థిని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్నాటకలో ఎమ్మెస్సీ మాథ్స్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో నాగేశ్వరి అనే విద్యార్థిని సీటు పొందారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు బి నాగరాజు, నక్క నరసింహ అధ్యాపకులు, దుర్గాప్రసాద్, వెంకటరమణ తదితరులు అభినందించారు.

విద్యార్థిని అభినందించిన ప్రిన్సిపాల్

నల్లగొండ రూరల్: స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ మూడో సంవత్సరం పూర్తిచేసిన విద్యార్థిని పుల్కారం మౌనిక పీజీ ఎంట్రెన్స్ పరీక్ష తెలుగు సబ్జెక్టులో 39వ ర్యాంకు సాధించింది. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ ఘన శ్యామ్ విద్యార్థిని బుధవారం కళాశాలలో అభినందించారు. హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయం నిర్వహించిన పీజీ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి కళాశాలకు గుర్తింపు తెచ్చారని ఆమెను ప్రశంసించారు. అదేవిధంగా అధ్యాపకులు భాస్కర్‌రెడ్డి, దేవవాణి, రాజారామ్, రాజశేఖర్, రవిచంద్ర, నరేష్‌లు మౌనికను అభినందించారు.

బాధిత కుటుంబానికి కోమటిరెడ్డి ఆర్థికసాయం

కనగల్ : రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. కనగల్ మండల పరిధిలోని ఇస్లాంనగర్ గ్రామానికి చెందిన షేక్ నజీర్ రాయి పనికి వెళ్లి ప్రమాదవశాత్తు బండ రాయి మీద పడి ఈ నెల 24న మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడికి మూగ భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి మంత్రి లక్ష రూపాయలను పంపారు. కనగల్ మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు కూసుకుంట్ల రాజిరెడ్డి, చర్లగౌరారం మాజీ సర్పంచ్ వెంకన్నలు బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మంత్రి పంపించిన రూ.లక్ష నగదు అందజేశారు.

మునుగోడు: మండలంలోని పులిపలుపుల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మందుల ఈదయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఈదయ్య మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు దోటి నారాయణ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొల్గూరి లింగయ్య, మాజీ సర్పంచ్ పందుల మారయ్య, అంజయ్య, సత్యద్, కంభంపాటి సైదులు, మునుగోటి యాదగిరి, లింగస్వామి, శంకరయ్య, యాదయ్య, గోపి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

నకిరేకల్ : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యతోపాటు పిల్లలు సమగ్రాభివృద్ధి సాధించేలా పనిచేయాలని ఐసీడీఎస్ మునుగోడు ప్రాజెక్టు అధికారి కవిత, సూపర్‌వైజర్ కళావతి అన్నారు. పూర్వ ప్రాథమిక విద్య, పాఠ్య ప్రణాళిక పునశ్చరణలో భాగంగా నకిరేకల్‌లో అంగన్‌వాడీ సిబ్బందికి బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నూతన జాతీయ విద్యా విధానం-2020, పూర్వ బాల్యారంభ దశ విద్య ప్రాముఖ్యతపై ప్రాజెక్టు అధికారి కవిత వివరించారు. కార్యక్రమంలో నకిరేకల్ సూపర్‌వైజర్ అంజమ్మ, శారద, పద్మావతి, జ్యోతి, సరిత, భవాని, సునీత పాల్గొన్నారు.

భూ హక్కులు కల్పించాలి

చిట్యాల: ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం భూ హక్కులు కల్పించాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి డిమాండ్ చేశారు. చిట్యాల మండలం బోయగుబ్బ గ్రామంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోయగుబ్బలో ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ధరణిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గుర్జ పరమేష్‌గౌడ్, గుర్జ లింగస్వామిగౌడ్, రాములు, గండమల్ల కిషన్, ప్రమీల, రెడ్డిమల్ల నర్సింహ, కృష్ణయ్య పాల్గొన్నారు.

రైతులకు తప్పని ఎదురుచూపులు

- డీడీలు చెల్లించి ఆరు నెలలు
- నేటికీ అందని ఆయిల్ పాం మొక్కలు
- భూములు పడావు ఉంచుకున్న రైతన్నలు
- సమస్య పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు

చండూరు: ప్రభుత్వ నిబంధనల మేరకు డీడీలు చెల్లించి ఆరు నెలలు దాటుతున్నా గట్టుప్పల్ మండల పరిధిలోని తేరట్‌పల్లి, ఖమ్మగూడెం గ్రామాల రైతులకు ఉద్యానవన పట్టు పరిశ్రమ శాఖ నుంచి ఆయిల్ పాం మొక్కలు అందడం లేదు. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ఏ పంటలు సేద్యం చేసుకోకుండా రైతులు భూములను పడావు ఉంచుతున్నారు. ఆరు నెలలుగా అధికారులు సమస్యకు పరిష్కారం చూపకుండా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఏ పంటలు వేసుకోకుండా భూములను పడావు ఉంచుతూ ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు అంటున్నారు.



గట్టుప్పల్ మండల శివారులో ఆయిల్ పాం మొక్కలు నాటేందుకు గుంతలు తీసిన ఓ రైతు

గట్టుప్పల్ మండల పరిధిలో..

గట్టుప్పల్ మండల పరిధిలోని తేరట్‌పల్లి, ఖమ్మగూడం గ్రామాలకు చెందిన కొంతమంది రైతులు ఆయిల్ పాం తోటలు సేద్యం చేయాలనే ఆసక్తితో ఉద్యానవన పట్టు పరిశ్రమ శాఖ అధికారులను సంప్రదించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు డ్రిప్, ఆయిల్ పాం మొక్కల కోసం 10 శాతం నగదును డీడీ రూపంలో డిసెంబర్, 2023 సంవత్సరంలో ఆ శాఖ అధికారులకు అందజేశారు. ఆనాటి నుంచి నేటి వరకు రైతులకు మొక్కలు అందించలేదు. ఆరు నెలలుగా అధికారుల చుట్టూ రైతులు తిరుగుతూనే ఉన్నారు.

ఎకరాకు రూ.4200

ఆయిత్‌పాం తోటల పెంపకానికి సన్న, చిన్నకారు రైతులను ప్రోత్సహించేందుకు ఉద్యానవన పట్టు పరిశ్రమ శాఖకు 10 శాతం డీడీ చెల్లిస్తే మిగిలిన 90 శాతం సబ్సిడీతో ప్రభుత్వం మొక్కలు, డ్రిప్ అందజేస్తుంది. ఆయిల్ పాం పంట చేతికి వచ్చేవరకు నాలుగు సంవత్సరాలపాటు ఎరువులు, ఇతర ఖర్చులకు ప్రభుత్వం ఎకరాకు ప్రతి ఏడాది రూ.4,200 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. ఐదో సంవత్సరం పంట చేతికి వస్తుంది. రైతులకు అధికారుల ప్రోత్సాహం లేకపోవడంతో ఆయిల్‌పాం తోటల సాగు లక్ష్యం నీరుగారుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

డీడీలు అందజేశాం



అధికారుల సూచనల మేరకు మొక్కలు, డ్రిప్‌నకు 10 శాతం డీడీ రూపంలో అందజేశాం. అదిగో.. ఇదిగో అంటూ ఆరు నెలలుగా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారు. మొక్కలు, డ్రిప్ ఇవ్వలేదు. ఏ పంట వేయకుండా భూమిని పడావు ఉంచాం. అధికారులు చొరవ తీసుకుని త్వరగా మొక్కలు అందజేయాలి.

–పగిళ్ల భిక్షం, తేరట్‌పల్లి, రైతు

ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం



మొక్కలకు, డ్రిప్‌లకు 10 శాతం నగదును డీడీ రూపంతో అధికారులకు అందజేశాం. ఆరు నెలలు గడుస్తున్నా మాకు మొక్కలు, డ్రిప్ అందజేయలేదు. వడ్డీలకు తెచ్చి డీడీలు కార్యాలయంలో అందజేశాం. మొదటగా తోటల పెంపకంపై ఇష్టం ఉండేది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పుడు ఇష్టం లేకుండా పోయింది.

–మాదాసు బెంజీ, ఖమ్మగూడెం

వారంలో సమస్య పరిష్కారం అవుతుంది

గట్టుప్పల్ కొత్త మండలం కావడంతో టెక్నికల్ ప్రాబ్లం ఏర్పడింది. వెబ్‌సైట్‌లో ఆప్షన్ రాకపోవడంతో ఆలస్యం జరిగింది. గతంలో చండూరు మండలం నుంచి విడిపోయి గట్టుప్పల్ మండల రావడంతో ఇబ్బందులు వచ్చాయి. వారంలోపు సమస్య పరిష్కారం అవుతుంది. రైతులకు సబ్సిడీ మొక్కలు అందుతాయి.

–శ్వేత, ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

కట్టంగూర్ : వ్యవసాయ పెట్టుబడి సాయం కోసం రైతులకు అందించే రైతు బంధును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. బుధవారం కట్టంగూర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని విమర్శించారు. 9 డిసెంబర్ 2023న రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తానని చెప్పి నేటికీ అమలు చేయకుండా రైతులను మభ్యపెడుతోందన్నారు. ఆరు మాసాల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చెడ్డపేరు తెచ్చుకున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో విద్యుత్ కొరత, మెరుగైన సౌకర్యాలు లేక రోగులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. కేసీఆర్ కిట్, కల్యాణ లక్ష్మి పథకాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. ప్రజల్లో తిరుగుబాటు వచ్చిందని రాష్ట్రంలో ప్రజాప్రతినిధులు గ్రామాల్లో తిరిగే ముఖం లేదన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ తరాల బలరాములు, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, ఎంపీటీసీ ఎడ్ల పురుషోత్తంరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పోగుల నర్సింహ, పెద్ది బాలనర్సింహ, రాచకొండ యాదయ్య, జానీపాష, వడ్డె సైదిరెడ్డి, నల్లమాద సైదులు, గుండగోని రాములు, రెడ్డిపల్లి మనోహర్, ఐతగోని సైదులు, రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య

బుచ్చిరెడ్డికి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న బుచ్చిరెడ్డి

కనగల్ : మండల పరిధిలోని చిన్నమాదారం జెడ్పీ హెచ్‌ఎస్‌లో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ప్రముఖ రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డికి రాష్ట్రస్థాయి కర్క ముత్తారెడ్డి స్మారక కవితా పురస్కారం లభించింది. బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సామాజిక చైతన్య వేదిక వసుంధర విజ్ఞాన వికాస మండలి 31వ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జరిగిన కార్యక్రమంలో ఏనుగు నరసింహారెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన కవితల్లో బుచ్చిరెడ్డి రాసిన 'మత సామరస్యం' అనే కవిత ఎంపికైంది. సంస్థ వ్యవస్థాపకులు వైద్యుల మధుకర్, తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి బాలాచారి తదితరులు పాల్గొన్నారు. బుచ్చిరెడ్డికి పురస్కారం లభించడంపై పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

చిట్యాల: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కొలను సునిత అధ్యక్షతన జరిగిన చివరి సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను వెల్లడించారు. వెలిమినేడు-1 ఎంపీటీసీ దేశబోయిన స్వరూప, వెలిమినేడు-2 ఎంపీటీసీ దేవరపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ వెలిమినేడులో గృహ అవసరాలకు అనుగుణంగా మిషన్ భగీరథ నల్లాలు ఏర్పాటు చేయడం లేదని ఆరోపించారు. కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాలకు మిషన్ భగీరథ నల్లాలను అధికారులు ఏర్పాటు చేశారని ఏఈలు అరుణ్‌కుమార్, రమేష్‌లను నిలదీశారు. అక్రమంగా ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నల్లాలను తొలగించాలని డిమాండ్ చేయగా.. వెంటనే తొలగిస్తామని ఏఈలు హామీ ఇచ్చారు. వెలిమినేడు గ్రామంలో పరిశ్రమలకు అక్రమంగా మట్టి తరలింపు జరుగుతోందని ఎంపీటీసీ సత్తిరెడ్డి చిట్యాల తహసీల్దార్ కృష్ణ దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ అనుమతుల మేరకు మట్టి తోలకం పనులు జరుగుతున్నాయన్నారు. మరోమారు పరిశీలించి అక్రమ మైనింగ్ జరుగుతున్నట్లు తేలితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వసభ్య సమావేశం అనంతరం ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న మండల పరిషత్ పాలకవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మర్ల అలివేలు, జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ, ఎంపీడీఓ జయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పెద్దబోయిన సత్తయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు మోసిన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కొలను సునిత

కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం

చండూరు : గ్రామాల్లో సర్పంచులు లేనందున పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎంపీపీ అవ్వారి గీతశ్రీనివాస్, జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చూసుకోవాలన్నారు. అలాగే పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇంటి పన్నులు వసూలు చేసి గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలని సూచించారు. పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో నిధులు లేనందున సిబ్బందికి సైతం వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మనోహర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామచంద్రం, ఏపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం



నల్లగొండ టూటౌన్: బంద్‌లో పాల్గొన్న విద్యార్థి సంఘం నాయకులు

నల్లగొండ టూటౌన్: ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్ అన్నారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా టెక్నికల్ కన్వీనర్ శివమణి, సోషల్ మీడియా కన్వీనర్ జయేందర్, ఎన్జీ కళాశాల అధ్యక్షుడు మణి, శివకృష్ణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

చండూరు: ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చండూరు మండలంలో బుధవారం నిర్వహించిన పాఠశాలల బంద్ విజయవంతమైంది. ఏబీవీపీ నాయకుడు భూతరాజు గణేశ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను బంద్ చేయించి, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సాయి, రాజు, ఈశ్వర్, భాను, మల్లేష్ ,శ్రీకాంత్, లోకేష్, రాకేష్, వంశీ, సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను బుధవారం ఏబీవీపీ నాయకులు బంద్ చేయించారు. కార్యక్రమంలో సందీప్, ధర్మా, తేజ, అంజి, లింగస్వామి, శివ, శంకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమి పరిశీలన

మునుగోడు: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా ఉన్న వివాదాస్పద భూమిని బుధవారం నల్లగొండ డీఎల్‌పీఓ వెంటేశ్వర్లు పరిశీలించారు. రెవెన్యూ అధికారులు 2018లో చేనేత సొసైటీకి 20 గుంటల భూమి కేటాయించారు. అందులో కొంత భూమిని ఆ సొసైటీ సభ్యులు అక్రమంగా పట్టా చేసుకుని కబ్జా చేశారని ఇటీవల జిల్లా పంచాయతీ అధికారికి సభ్యులు ఫిర్యాదు చేశారు. డీపీఓ సూచన మేరకు డీఎల్‌పీఓ చేనేత కార్మికులతో కలిసి ఆ భూమిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు. సొసైటీ భూమిలో కొంత కబ్జాకు గురైనట్లు గుర్తించారు. పూర్తిస్థాయి నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి అందజేయనున్నట్లు డీఎల్‌పీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ పుష్పలత, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, చేనేత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చెర్కు సైదులు, మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న, సంఘం సభ్యులు సింగం శివయ్య, మిర్యాల అశోక్, చిలుకూరి మధు, సింగం వెంకటేషం, చెరుపల్లి లక్ష్మయ్య, సింగం గిరి, చామల మహేష్, కర్నాటి రాజు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

మునుగోడు: మండల కేంద్రం నుంచి నల్లగొండకు వెళ్లే ప్రధాన రోడ్డుపై పడిన గుంతలను ఆర్అండ్‌బీ అధికారులు బుధవారం పూడ్చివేయించారు. మునుగోడు శివారులోని రైలు మిల్లు వద్ద దాదాపు 50 మీటర్ల వరకు పెద్దపెద్ద గుంతలు పడి వాహనదారుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుండడంతో బుధవారం సాక్షి దినపత్రికలో రోడ్డు ఇలా..ప్రయాణించేది ఎలా ! అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్అండ్‌బీ ఏఈ శిరీష్ వెంటనే గుంతల్లో కంకర నింపించి మరమ్మతులు చేయించారు.



మరమ్మతు పనులు చేయిస్తున్న ఏఈ శిరీష్

మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత

రామగిరి(నల్లగొండ): మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత అని తిప్పర్తి ఎస్‌ఐ డి.రాజు అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నరహరి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నల్లగొండ టౌన్: యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని విపస్య స్కూల్ ప్రిన్సిపాల్ గోపాల శ్రీనివాసరావు అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం విపస్య స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలతో జరిగే నష్టాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కనగల్ : మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్డు వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామకృష్ణ, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

మాదక ద్రవాల నిర్మూలనపై ర్యాలీ

నకిరేకల్ : మాదక ద్రవ్యాల నిర్మూలన, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నకిరేకల్‌లోని జెడ్పీ హైస్కూల్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సీఐ రాజశేఖర్, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రాములు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం

కట్టంగూర్ : మాదక ద్రవ్యాలు లేని సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ పాటుపడాలని తహసీల్దార్ గుగులోతు ప్రసాద్ అన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి నిర్వహించిన ర్యాలీలో తహసీల్దార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్ఞాన ప్రకాశ్‌రావు, ఎస్‌ఐ ఎన్.శ్రీను, హైస్కూల్ హెచ్‌ఎం అంబటి అంజయ్య, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిట్యాల: పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో బుధవారం మాదవ ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ జయలక్ష్మి, నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, చిట్యాల ఎస్‌ఐ సైదాబాబు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం గోగికార్ మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చండూరు, గట్టుప్పల్ మండలాల్లో..

చండూరు : మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా చండూర్, గట్టుప్పల్ మండల కేంద్రాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చండూరు, గట్టుప్పల్ ఎస్‌ఐలు ఉప్పు సురేష్, గుత్త వెంకట్‌రెడ్డి, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఐ నర్ర అంతిరెడ్డి, ఏఎస్‌ఐ నర్సిరెడ్డి, సీహెచ్‌ఓ శ్రీరాములు, హెడ్ కానిస్టేబుల్ బూతరాజు రమేష్, గిరిబాబు, శివశంకర్, చారి పాల్గొన్నారు.

మునుగోడు: ఆరోగ్యానికి హాని కలిగించే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు, వివిధ పార్టీల నాయకులతో కలిసి మునుగోడులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన మానవహారం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ పార్టీల నాయకులు భీమనపల్లి సైదులు, తాటికొండ సైదులు, వేదాంతం గోపీనాథ్, అన్వర్, గుర్రాల పరమేష, శంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నకిరేకల్ : ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు



చిట్యాల: ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు



నార్కట్‌పల్లి : ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



చండూరు మండల కేంద్రంలో..



మునుగోడు : మానవహారం ఏర్పాటు చేసిన విద్యార్థులు, పోలీసులు



తిప్పర్తి మండల కేంద్రంలో..



కనగల్ : ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నల్లగొండ టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ సేవలను థర్డ్ పార్టీకి అప్పగించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.దండంపల్లి సత్తయ్య, వెంకటయ్య, గండమల్ల శ్రీనివాస్, కృష్ణ, సైదులు, ఏసు, తారమ్మ, జంగయ్య, జాని, నర్సింహ, వెంకటరెడ్డి, నర్సమ్మ, శోభ, చంద్రమ్మ, రాజు పాల్గొన్నారు.

ట్యాంకును శుభ్రం చేయించిన అధికారులు

మునుగోడు: మండల కేంద్రంలోని కృష్ణా జలాల మంచి నీటి ట్యాంక్ అపరిశుభ్రంగా ఉండడంతో బుధవారం సాక్షి దినపత్రికలో అపరిశుభ్రంగా మంచి నీటి ట్యాంక్ అనే కథనం ప్రచురితమైంది. దీంతో మునుగోడుకు పలు వివాదాల విచారణ నిమిత్తం వచ్చిన నల్లగొండ డీఎల్‌పీఓ కె.వెంకటేశ్వర్లు అపరిశుభ్రంగా ఉన్న ట్యాంక్‌ను పరిశీలించారు. ట్యాంక్‌ను బ్లీచింగ్ పౌడర్‌తో పరిశుభ్రంగా కడిగించి ట్యాంక్ చుట్టూ గడ్డి, మట్టిని తొలగింపచేశాడు.

దేశంలో కుల నిర్మూలన జరగాలి

నల్లగొండ టౌన్: దేశంలో మనుధర్మ శాస్త్రాన్ని నిషేధించడంతో పాటు కుల నిర్మూలన జరగాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్‌బాబు అన్నారు. బుధవారం కేవీపీఎస్ జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులను ఆయన నల్లగొండ పట్టణంలోని ఎంవీఎన్ భవన్‌లో ప్రారంభించి మాట్లాడారు. దేశంలో 6486 కులాలు, 28 వేల ఉపకులాలు ఉన్నాయన్నారు. కులం పేరిట దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత, గిరిజనులపై దాడులు మరింత పెరిగాపోయాయన్నారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ.. దళితబంధు, ఇళ్ల స్థలాలు, విదేశీ విద్య నిధి, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సరైన వసతులు లేని పాఠశాలలను మూసివేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, రాష్ట్ర కమిటీ సభ్యులు పరుశరాములు, బొట్టు శివకుమార్, బొల్లు రవీందర్, విజయ్‌కుమార్, కృష్ణ, దంతాల నాగార్జున, బాబురావు, రామస్వామి, రవికుమార్, దేవయ్య, శ్యాం, మల్లయ్య, లక్ష్మి పాల్గొన్నారు.



కేవీపీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న స్కైలాబ్‌బాబు

నూతన కార్యవర్గం ఎన్నిక

శాలిగౌరారం: శాలిగౌరారం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడిగా డెంకల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా చామల మహేందర్ రెడ్డి, రాపాక రాజు, ప్రధాన కార్యదర్శిగా మారోజు వెంకటాచారి, కోశాధికారిగా వడ్లకొండ భిక్షం, సలహాదారులుగా రామడుగు వెంకటరామశర్మ, ఆకవరం అశోకాచారి, నిమ్మల ఆంజనేయులు, లీడర్‌షిప్ సభ్యుడిగా గుజిలాల్ శేఖర్‌బాబు, మెంబర్‌షిప్ సభ్యుడిగా చిరబోయిన శ్రీనివాస్, సర్వీస్ మెంబర్‌గా బచ్చు ఆంజనేయులు, మార్కెటింగ్ మెంబర్‌గా కరుణాకర్, అదనపు మెంబర్‌గా రామకృష్ణ, మహిళా ప్రతినిధిగా యారాల పద్మ, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్‌గా వేణుగోపాల్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో శంభులింగారెడ్డి, అశోక్, రాంరెడ్డి, గంట అంజిరెడ్డి, బుడిగె శ్రీనివాసులు పాల్గొన్నారు.